మా భవిష్యత్‌కే తొలి ఓటు



తొలిసారిగా ఓటు వేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. మా భవిష్యత్‌కు తొలి ఓటు వినియోగించుకుంటాను. ఓటు హక్కు పొందిన వారంతా తప్పనిసరిగా ఓటు వేయాలి. ఎలాంటి పనులున్నా, పోలింగ్ కేంద్రానికి తరలివచ్చి ఓటు వినియోగించుకోవాలి. ఇదే విషయాన్ని నా స్నేహితులందరికీ చెప్పా..ఐదేళ్లు మనల్ని పాలించే ప్రభుత్వాన్ని ఎన్నుకునే తరుణంలో మనకు మేలు చేసేవారికే ఓటు వేయాలి. -ఎం. గౌతమ్, కరాస, 52వ వార్డు

చాలా ఆనందంగా ఉంది



తొలిసారి ఓటు హక్కు వినియోగిస్తున్నందుకు ఆనందంగా ఉంది. అందరికీ మేలు చేసే ప్రభుత్వం రావాలి. మన కోసం పనిచేసే వారికే నా తొలి ఓటు. భవిష్యత్ కోసం వేసే ఓటుపై యువతరం ఆలోచించాలి. మనకు మేలు ఎవరు చేశారు..? ఎవరు చేస్తారు అనేది గమనించాలి. లేకుంటే ఐదేళ్లు ఇబ్బందులు పడతాం. -కె.జీవన, ప్రియాంక కాలనీ, 52వ వార్డు

అందుబాటులో ఉండే నాయకుడికే నా ఓటు



తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్నాను. ఏడాది కాలంగా ఓటు హక్కు కోసం ఎంతో ఆతృతతో ఎదురు చూస్తున్నా..నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, పోటీ చేసే అభ్యర్థి వ్యక్తిత్వం..ఈ రెండూ చూసి ఓటు వేస్తా.. నా దృష్టిలో ఎమ్మెల్యే అంటే ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఓట్లు కోసం వచ్చే నాయకుడిగా ఉండకూడదు. -బర్మాల రఘు, నాగేంద్ర కాలనీ

తొలిసారిగా ఓటు హక్కు



ఐదేళ్ల మన భవిష్యత్తును నిర్ణయించే వజ్రాయుధం ఓటు. ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా తొలిసారిగా ఓటు వేసేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. మంచి చేసే వ్యక్తినే ఎన్నుకుంటా..రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం..ఎవరు ఎమ్మెల్యే అయితే బాగుంటుందో ఇప్పటికే ఓ ఆలోచనకు వచ్చా..నా ఓటు రూపంలో తెలియజేస్తా. -ఆరిపాక దీప్తిక, ఎన్ఏడీ

మంచి నాయకుడ్నే ఎన్నుకుంటా



నియోజకవర్గానికి మంచి నాయకుడు అవసరం ఎంతో ఉంది. అందుబాటులో ఉండే వ్యక్తినే ఎన్నుకుంటా. సాయం చేసే గుణం వ్యక్తికే నా ఓటు. గత కొద్ది కాలంగా వందల కోట్లతో చేసిన అభివృద్ధి కనిపిస్తోంది. పేదలకు ఎవరైతే సేవలు చేస్తారో వారినే ఎన్నుకుంటా. -అనిత, ఎంబీఏ విద్యార్థిని, మల్కాపురం

ఓటుకు వేళాయె

- 222 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- ఆర్‌వో హుస్సేన్ సాహెబ్
- ఆయా కేంద్రాలకు చేరిన పోలింగ్ సామగ్రి



షిప్‌యార్డ్ పోలింగ్ కేంద్రం


గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పోలింగ్ సామగ్రితో సిబ్బంది

మొత్తం ఓటర్లు :	2,13,439
పురుషులు :	1,05,202
మహిళలు :	1,08,226
ఇతరులు :	11
పోటీలో ఉన్న అభ్యర్థులు :	13 మంది
మొత్తం పోలింగ్ కేంద్రాలు :	222
సమస్యాత్మక కేంద్రాలు :	69
వెబ్‌కాస్టింగ్ :	162 కేంద్రాల్లో..
విధులు నిర్వహించే సిబ్బంది :	1,937 మంది
పోలింగ్ కేంద్రం వద్ద సమస్యలు ఏర్పడితే ఫిర్యాదు చేయాల్సిన నంబర్ :	98499 03825

కంచరపాలెం: రాష్ట్ర ప్రజల భవితవ్యాన్ని తేల్చే రోజు రానేవచ్చింది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరగనుంది. దీనికి సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పశ్చిమ నియోజకవర్గంలో 222 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 13 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు ఆదివారం ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆయా పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, పోలింగ్ సామగ్రిని తరలించినట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్ తెలిపారు. కంచరపాలెం పరిధిలో రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాల, జీవీఎంసీ కంచరపాలెం ప్రాథమిక, అంగన్వాడీ కేంద్రాలు, బాల్యం పాఠశాలలు, ఎఫ్‌సీ పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. పోలింగ్ బూత్‌ల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా

పశ్చిమ నియోజకవర్గంలో 69 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పోలీసులు గస్తీ ముమ్మరం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. పౌరులందరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే వాతావరణం కల్పించారు. పోలింగ్ కేంద్రాలకు ఎవరూ సెల్‌ఫోన్లు తీసుకురావొద్దని సూచించారు. పోలింగ్ వేళ అటు రాజకీయపార్టీలు, ప్రజలు అధికారులకు సహకరించాలని ఆర్‌వో హుస్సేన్ సాహెబ్ కోరారు.


కంచరపాలెం పాఠశాలలో పోలింగ్ ఏర్పాట్లలో ఉద్యోగి నిమగ్నం

సర్వం సిద్ధం

గోపాలపట్నం: ఓట్ల పండగ కు వేళాయింది. మంచి చేసేవారెవరో, అభివృద్ధి చేసేవారెవరో, మోసం చేసే వారెవరో ప్రజలకు ఇప్పటికే ఓ స్పష్టతకు వచ్చారు. ఓట్ల రూపంలో నేడు అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చనున్నారు. పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,13,439 మంది. వీరిలో పురుషులు 1,05,202, మహిళలు 1,08,226 మంది. ఇతరులు 11 మంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్‌జరగనుంది. 6 గంటల సమయానికి పోలింగ్ బూత్ క్యూలో ఉన్నవారందరికీ ఓటు వేసుకునే సదుపాయం కల్పించనున్నారు. ఎక్కడైనా సమస్యలు ఏర్పడితే రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్ 98499 03825 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ఆయా జోన్లలో జోనల్ కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేయవచ్చు. ఎక్కడా రిగ్గింగ్ జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టామని అధికారులు చెబుతున్నారు.


మల్కాపురం ప్రైమరీ పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద సీసీ కెమెరా ఏర్పాటు


షిప్‌యార్డ్ కళాశాల పోలింగ్ కేంద్రం వద్ద శుభ్రపరుస్తున్న శానిటరీ సిబ్బంది


పోలింగ్‌కు సిద్ధమైన గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

పారిశ్రామిక ప్రాంతంలో..

మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతంలో పలు ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఆదివారం ఉదయం నుంచే హడావుడి కనిపించింది. అధికారులు, సిబ్బంది పోలింగ్ కోసం చర్యలను చేపట్టారు. మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో షిప్‌యార్డ్ కళాశాల, సింధియా, గాంధీగ్రామ్ విద్య నిలయం, మల్కాపురం జీవీఎంసీ ప్రైమరీ, మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల, శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల, శ్రీహరిపురం, గుల్లలపాలెం ప్రైమరీ పాఠశాల, శ్రీహరిపురం సరస్వతి పాఠశాల వద్ద 77 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు.


రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో పోలీసులు

పోలింగ్ కేంద్రాలను క్రైమ్ డీసీపీ వెంకటరత్నం, మల్కాపురం సీఐ సన్నైఉల్లా , సిబ్బంది పరిశీలించారు. అలాగే పోలింగ్ కేంద్రాల పరిసరాలను వార్డు శానిటరీ సిబ్బంది బ్లీచింగ్ జల్లారు.

పార్కుల్లో సందడి


ఓపెన్ జిమ్ వద్ద యువతి యువకులు, చిన్నారులు

మల్కాపురం : వేసవి సెలవులు, దీనికి తోడు ఆదివారం కావడంతో 60వ వార్డు గుల్లలపాలెం,వాకింగ్ పార్కులోని ఓపెన్ జిమ్‌లో యువతీయువకులతో పాటు, చిన్నారులతో సందడిగా కనిపించింది. ఓటు వేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి విశాఖ వచ్చినవాళ్లు, వాళ్లపిల్లలతో పార్కుల్లో సేదదీరారు.

పాము కలకలం


సర్పాన్ని బయటకు తీసుకున్న స్నేక్ క్యాచర్

మల్కాపురం : 61వ వార్డు మల్కాపురం, ప్రకాష్‌నగర్ కొండ ప్రాంతంలో ఓ ఇంట్లో లావెట్రీ రంధ్రంలో ఓ విష సర్పం దూరబడింది. ఆ సమయంలో మూత్ర విసర్జనకు వెళ్లిన ఆ ఇంటి యజమాని భయందోళనకు గురయ్యాడు. దీంతో స్థానికంగా ఉన్న ఓ యువకుడు, మరో పారిశుద్ధ్య కార్మికుడి సాయంతో ఆ సర్పాన్ని బయటకు తీసి, దానిని కొండ ప్రాంతంలో విడిచిపెట్టారు.

అనాథ శవానికి అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న మమత

విశాఖ విద్య: అనాథ మృతదేహానికి బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత ఆధ్వర్యంలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ నాగరాజు అనే వృద్ధుడు మృతి చెందాడు. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు బంధువులు ఎవ్వరూ లేకపోవటంతో విషయం తెలుసుకున్న జీవీఎంసీ ప్రాజెక్టు డైరెక్టర్ పాపునాయుడు ఈ విషయాన్ని బుచ్చిరాజు పాలెం షెల్టర్‌మేనేజర్ మమతకు తెలిపారు. ఆమె కేజీహెచ్‌కు వెళ్లి, అనాథ మృతదేహాన్ని జ్ఞానాపురం శ్మశాన వాటికలో శాస్త్రోక్తంగా అంత్యక్రియలు జరిపించారు. మహిళ అయినప్పటికీ, ఎల్లేటి మమత ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతుండటం పట్ల పలువురు అభినందించారు.

ఓ'టూరు'


రైలులో కిటకిటలాడుతున్న ప్రయాణికులు


రెలు ఎక్కేందుకు ఎగబడుతున్న ఓటర్లు


గోపాలపట్నం రైల్వే స్టేషన్ పార్కింగ్‌లో వాహనాలు

గోపాలపట్నం: మళ్లీ పండగొచ్చింది. సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో విశాఖ నుంచి సొంతూరు వెళ్లేందుకు ఓటర్లు క్యూ కట్టారు. దీంతో రైళ్లు, బస్సులు రద్దీగా మారాయి. గోపాలపట్నంలోని సింహాచలం రైల్వే స్టేషన్ ప్రయాణికులతో రద్దీగా మారింది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతో పాలు గ్రామాలకు ఇక్కడి ప్రయాణమయ్యారు. గోపాలపట్నం రైల్వే పార్కింగ్ ఎపుడూ లేని విధంగా ఫుల్ అయింది. వాహనాలు పెట్టేందుకు అవకాశం లేదని పార్కింగ్ నిర్వాహకులు చేతులెత్తేశారు.

ఘనంగా మదర్స్‌డే


గోపాలపట్నం ఆస్పత్రి వద్ద మాతృమూర్తి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కళాసేవా పీఠం సభ్యులు

గోపాలపట్నం: గోపాలపట్నం కళాసేవా పీఠం ఆధ్వర్యంలో మదర్స్‌డే ఘనంగా నిర్వహించారు. ఇక్కడి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మాతృమూర్తి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఆస్పత్రిలో ఉన్న బాలింతలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళా సేవా పీఠం వ్యవస్థాపకుడు, నంవరపు సోములు మాట్లాడుతూ తల్లికి మించిన దైవం లేదన్నారు. ఆమె లేనిదే మనుగడ లేదన్నారు. అధ్యక్షుడు గొరకల రామదాసు మాట్లాడుతూ వృద్ధాశ్రమాల్లో తల్లిదండ్రులు ఉండడడం చాలా దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు కంపర అప్పారావు, చందు సుబ్బారావు, నూక రాజేశ్వరరావు, రామచంద్రరావు, నవీన్, శ్రీనివాస్, భాస్కర్ పాణిగ్రాహి పాల్గొన్నారు.

ఆటో సుందర్ ఆదర్శం


గోషాస్పత్రికి తీసుకు వెళుతున్న ఆటో డ్రైవర్ సుందర్

గోపాలపట్నం: గోపాలపట్నం లక్ష్మీనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ సుందర్ ఓ గర్భిణీనిని ఉచితంగా గోషాస్పత్రికి తీసుకువెళ్లి ఆదర్శంగా నిలిచాడు. నాయుడు తోట అప్పలనర్సయ్య కాలనీకి చెందిన లక్ష్మి గర్భిణి. అత్యవసరం కావడంతో ఆశ వర్కర్ సమాచారం మేరకు ఆటో డ్రైవర్ సుందర్ ఉచితంగా లక్ష్మిని ఆస్పత్రికి తీసుకువెళ్లాడు. అలాగే సుందర్ చందనోత్సవంలో కూడా వృద్ధులను, దివ్యాంగులను ఉచితంగా సింహాచలం తీసుకు వెళ్లాడు. సుందరం చేస్తున్న సేవలను పలువురు అభినందిస్తున్నారు.

16 నుంచి పెంటమాంబ అమ్మవారి పండగ


అమ్మవారి పండగ చాటింపు చేస్తున్న దృశ్యం

మల్కాపురం : 59వ వార్డు హిమచల్‌నగర్ గ్రామదేవత పెంటమాంబ అమ్మవారి పండుగ మహోత్సవ పూజా కార్యక్రమాలు ఈ నెల 16వ తేదీ నుంచి జరగనున్నాయి. పండగకు సంబంధించిన చాటింపు కార్యక్రమం ఆదివారం సాయంత్రం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ నమ్మి గౌరీశ్వర రావుయాదవ్ మాట్లాడుతూ గురువారం నుంచి అమ్మవారి ఉత్సవాలను మొదలవుతాయని, తొలి రోజు చింతాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, రెండు, మూడు రోజులు (శుక్ర,శనివారాలు)నాడు పెంటమాంబ తల్లికి ప్రత్యేక పూజలు, 18,19వ తేదీల్లో రాయగాడ మజ్జిగౌరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, 20వ తేదీన ప్రధాన పండగ, పెంటమాంబ అమ్మవారి దర్శన కార్యక్రమాలు ఉంటాయన్నారు. అమ్మవారి ప్రతిమ పుర వీధులలో ఊరేగిస్తామని చెప్పారు. ఈ నెల 27న మారువారం పండగ సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహిస్తామని చెప్పారు.